క్లుప్తంగా

ఫైనాన్స్ బిల్‌ను రద్దు చేయాలి


మాట్లాడుతున్న యల్లమందారెడ్డి

పొదిలి: కొత్త పెన్షన్లు, పాత పెన్షన్ల మధ్య వ్యత్యాసం ఏర్పడి పాత పెన్షనర్లు నష్టపోయే ఫైనాన్స్ బిల్ 2025ను వెంటనే రద్దు చేయాలని పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు ఏ.బాదుల్లా కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం శనివారం స్థానిక పెన్షనర్ల భవనంలో జరిగింది. ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, యల్లమందారెడ్డి మాట్లాడుతూ 15వ తేదీన ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఫైనాన్స్ బిల్ 2025ను రద్దు చేయాలని, కేంద్రంలో 8వ పే కమిషన్, రాష్ట్రంలో 12వ పే కమిషన్ వెంటనే నియమించాలని తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో సభ్యులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించాలంటూ వేడుకోలు

పుల్లలచెరువు: తమకు జీతాలు ఇప్పించాలంటూ స్థానిక గ్రామ పంచాయతీ కార్మికులు వేడుకుంటున్నారు. ఈ మేరకు వారు శనివారం మాట్లాడుతూ తమను పనులకు మాత్రమే వాడుకుంటున్నారని, కనీసం తాము ఎలా జీవనం సాగించాలో సర్పంచ్, కార్యదర్శి లోచన చేయకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు ఇవ్వండని అధికారుల చుట్టూ తిరిగి కాళ్లు అరుగుతున్నాయని, తమలాంటి చిరుద్యోగులు జీతాలు లేకుంటే ఎలా జీవనం సాగిస్తారని, ఇప్పటికైనా అధికారులు స్పందించి జీతాలు వచ్చే ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

వికసిత్ భారత్ కోసం మోదీ కృషి

త్రిపురాంతకం: వికసిత్ భారత్ కోసం ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గెం శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆ పార్టీ మండల సమావేశం శనివారం జరిగింది. జాతీయ స్థాయిలో బీజేపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. అనంతరం ఆయన మండల కమిటీని ప్రకటించారు. మండల అధ్యక్షురాలిగా మునికుమారిని ప్రకటించారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు కె.పిచ్చయ్య, మల్లికార్జున్, నాసరరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ నాయకులు నాగేశ్వరావు, నర్సయ్య, వీరాంజనేయులు, సత్యనారాయణ పాల్గొన్నారు.


గంగంపల్లెలో సాగు చేసిన ఆముదం పంట


జేపీ చెరువులో వ్యవసాయ బోర్ల కింద సాగు చేసిన పత్తి పంట

మిర్చిసాగా..ఇప్పుడొద్దులే..!

- మిర్చి సాగుపై ఆసక్తి చూపని రైతులు
- తగ్గిన సాగు విస్తీర్ణం
- మిర్చి సాగులో పెరిగిన పెట్టుబడులు
- లభించని మద్దతు ధర
- పత్తి, ఆముదం సాగుపై రైతుల మొగ్గు


అనుమలవీడులో ఆముదం విత్తనాలు నాటుతున్న మహిళలు

రాచర్ల: వాణిజ్య పంటల్లో ప్రధానమైన మిర్చి పంట సాగుపై రైతులు ఆసక్తి చూపించడం లేదు. మిర్చి సాగు చేయాలంటే రైతులు భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. గతేడాది మిర్చి సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. దిగుబడి ఆశాజనకంగా ఉన్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు నష్టాలు చవిచూశారు. ఎరువులు, పురుగుల మందుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో పంట సాగు చేసేందుకు రైతులు వెనుకంజ వేస్తున్నారు. మిర్చి పంట కోత సమయంలో కూలీల డిమాండ్ పెరిగిపోవడంతో చాలా చోట్ల కోత కోయకుండా వదిలేశారు. మిర్చి పంట సాగు చేయడానికి అధిక పెట్టుబడులు అవుతుండటంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. దీంతో ప్రత్యామ్నాయంగా పత్తి, ఆముదం పంటలు సాగు చేసేందుకు మొగ్గుచూపుతున్నారు. నియోజకవర్గంలోని గిద్దలూరు, రాచర్ల, కొమరోలు, బేస్తవారిపేట మండలాల్లో గత ఏడాది 4,667 ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశారు. గత సంవత్సరం దిగుబడులు వచ్చిన మిర్చి పంటకు మద్దతు ధర కల్పించడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా మిర్చి ధర రూ.22 వేల నుంచి రూ.24 వేల వరకూ ఉండగా కూటమి ప్రభుత్వం రాగానే మిర్చి క్వింటా ధర రూ.9 వేల నుంచి రూ.12 వేలు కూడా పలక్కపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. కొంతమంది రైతులు క్వింటా ధర రూ.9 వేల నుంచి రూ.12 వేల వరకూ అమ్ముకోగా మరికొంత మంది రైతులు ధర పూర్తిగా పతనం కావడంతో గుంటూరు, గిద్దలూరు, పట్టణాల్లోని ఏసీ గోడౌన్‌లలో నిల్వ చేసుకున్నట్లుగా రైతులు ఆరోపిస్తున్నారు. ఎకరా మిర్చి సాగు చేయడానికి విత్తనాలు, నేల మందులు, పురుగుల మందులు, సేద్యాలు, కూలీలు కలిపి దాదాపు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకూ పెట్టుబడి అవుతుందని రైతులు వివరించారు.

పొలాల్లోనే వదిలేసిన మిర్చి పంట:

మిర్చి పంట దిగుబడి వచ్చినా కనీస మద్దతు ధర లేకపోవడంతో కోత కోసేందుకు కూలీల ఖర్చు పెరిగిపోవడంతో చాలా మంది రైతులు మిర్చి కోత చేయకుండానే పొలంలో వదిలేసిన సంఘటనలు గ్రామాల్లో చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఇప్పటి వరకు గిద్దలూరు నియోజకవర్గ పరిధిలోని రాచర్ల, గిద్దలూరు, కొమరోలు, బేస్తవారిపేట మండలాల్లో కలిపి బోర్ల కింద కేవలం ఎనిమిది ఎకరాల్లో మిర్చి పంట సాగు చేసినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు.

పత్తి, ఆముదం సాగుపై రైతుల మొగ్గు..

ఈ ఏడాది నియోజకవర్గంలో మిర్చి పంటకు బదులుగా రైతులు పత్తి, ఆముదం సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ బోర్ల కింద పత్తి 2,012 ఎకరాలు, ఆముదం 767 ఎకరాల్లో సాగు చేశారు. ప్రస్తుతం వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో వ్యవసాయ బోర్లకు సాగు నీరందక కొన్ని గ్రామాల్లో పత్తి పంట ఎండుముఖం పడుతోంది. వ్యవసాయ బోర్లకు వచ్చే కొద్దిపాటి సాగు నీటితో పత్తి, ఆముదం పంటకు నీటితడులు పెట్టుకుంటే పడమటి గాలులకు తేమంతా ఎండిపోతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క క్వింటా కూడా అమ్మలేదు



నేను రెండు ఎకరాల్లో మిర్చి పంటను సాగు చేశాను. మిర్చి పంట దిగుబడి బాగా వచ్చినా గిట్టుబాటు ధర లేకపోవడంతో ఒక క్వింటా కూడా అమ్మలేదు. ధర లేకపోవడంతో మిర్చి పంటంతా గుంటూరులో ఏసీ గోడేన్‌లో భద్రపరిచాను. మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో ప్రస్తుతం రెండు ఎకరాల్లో పత్తి, నాలుగు ఎకరాల్లో ఆముదం పంట సాగు చేశాను.

– బిజ్జం వెంకట్‌రెడ్డి, రైతు, గంగంపల్లె

మిర్చికి రూ.లక్షల్లో పెట్టుబడి



నాలుగు ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాను. రూ.లక్ష పెట్టుబడి పెట్టాను. తీరా మిర్చి దిగుబడి వచ్చిన సమయానికి క్వింటా రూ.9 వేల నుండి 12 వేలు మాత్రమే ధర ఉంది. ధరలు పెరగకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వచ్చింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో క్వింటా మిర్చి ధర రూ.20 వేల నుంచి 24 వేల వరకు పలికింది. ఇప్పుడు మిర్చికి గిట్టుబాటు ధర లేకపోవడంతో అరకొరగానే మిర్చి పంట సాగు చేశారు.

– పగిడి ఆదినారాయణరెడ్డి, రైతు, జేపీ చెరువు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

గిద్దలూరు రూరల్: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు పి.మస్తాన్‌రెడ్డి, మౌలాలి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరు, పారిశుద్ధ్య కార్మికులు వారి సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న సమ్మెలో భాగంగా పట్టణంలోని మున్సిపల్ కార్మికులు శనివారం బైక్ ర్యాలీతో పాటుగా మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీవో 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, క్యాటగిరీ వారీగా కార్మికులందరికీ వేతనాలు చెల్లించాలని, రిటైర్డ్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగం కల్పించాలని, వయో పరిమితి 62 ఏళ్లకు పెంచాలని, గత సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయాలని వంటి డిమాండ్ల సాధన కోసం కార్మికులు ఐకమత్యంగా పోరాడతారన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు పుల్లయ్య, నాగయ్య, రంగస్వామి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

12 గంటలైనా..తెరుచుకోని పశువైద్యశాల


12 గంటలైనా తెరుచుకోని చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల


12.13 గంటలకే మూతపడిన అనుములపల్లె గ్రామీణ పశువైద్యశాల

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలోని గ్రామీణ పశువైద్యశాల శనివారం మధ్యాహ్నం 12 గంటలవుతున్నా తెరుచుకోలేదు. గతంలో ఇక్కడ లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌గా పనిచేసిన ఏ.శివచరణ్ గౌడ్ అనుములపల్లె గ్రామానికి బదిలీ కాగా ఆయన స్థానంలో సుప్రియ బాధ్యతలు స్వీకరించారు. బదిలీలు జరిగి దాదాపు నెలవుతున్నా చోళ్లవీడు గ్రామీణ పశువైద్యశాల సక్రమంగా తెరవడం లేదని పశుపోషకులు ఆరోపించారు. శనివారం రైతులు, గొర్రెల కాపరులు పశువైద్యశాలకు వచ్చి వేచి ఉన్నా ఎవరూ ఎంతసేపటికీ రాకపోవడంతో వెనుతిరిగారు. అంతేకాక అనుములపల్లె గ్రామీణ పశువైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న లైవ్‌స్టాక్ అసిస్టెంట్ ఏ.శివచరణ్ గౌడ్ మధ్యాహ్నం 12:13 గంటలకే తాళాలు వేసి వెళ్లిపోయారు. మళ్లీ సాయంత్రం విధులకు రావాల్సి ఉండగా డుమ్మాకొడుతున్నారని రైతులు ఆరోపించారు. ఈ రెండు గ్రామాల్లో సకాలంలో పశువులకు, గొర్రెలకు, మేకలకు వైద్య సేవలు అందడంలేదని ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని చోళ్లవీడు, అనుములపల్లె గ్రామాల్లోని గ్రామీణ పశువైద్యశాలల్లో పనిచేసే లైవ్‌స్టాక్ అసిస్టెంట్‌లు రైతులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల పశుపోషకులు కోరుతున్నారు.

మంచినీటి సమస్యతో అవస్థలు


బోరు నుంచి బయటకు తీసిన విద్యుత్ మోటార్


మోటార్ సైకిల్‌పై నీరు తెచ్చుకుంటున్న గ్రామస్తులు

- జేసీ అగ్రహారంలో మరమ్మతులకు గురైన విద్యుత్ మోటార్

బేస్తవారిపేట: మండలంలోని జేసీ అగ్రహారంలో సింగిల్ ఫేజ్ విద్యుత్ మోటార్ మరమ్మతులకు గురైంది. జగనన్నకాలనీ వెళ్లే రోడ్డులోని విద్యుత్ మోటార్ 20 రోజులుగా పనిచేయడం లేదు. పలు మార్లు పంచాయతీ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరు లోపలి నుంచి విద్యుత్ మోటార్ బయటకు తీసి మరమ్మతులు చేయిస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామంలోకి వెళ్లి గృహ అవసరాలకు, పశువులకు సరిపడా నీటిని తెచ్చుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తల్లో జోష్


వైఎస్సార్‌కు నివాళులర్పిస్తున్న అన్నా, బూచేపల్లి, జంకె, బత్తుల


ఎమ్మెల్యే బూచేపల్లిని సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

- హోరెత్తిన జై జగన్ నినాదాలు

మార్కాపురం టౌన్/తర్లుపాడు: మార్కాపురం నియోజకవర్గ స్థాయి వైఎస్సార్ సీపీ కార్యకర్తల విస్తృత సమావేశం శనివారం పట్టణంలోని బి కన్వెన్షన్ హాల్లో జరిగింది. సమావేశం పార్టీ కార్యకర్తల్లో జోష్ నింపింది. ముఖ్యనాయకులు మాత్రమే హాజరవుతారని భావించగా నియోజకవర్గంలోని పట్టణ, రూరల్, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండలాల నుంచి సమావేశానికి కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడంతో కన్వెన్షన్ హాలు పూర్తిగా నిండిపోయి బయట వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాయకులు ప్రసంగిస్తున్నంత సేపు, బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీపై ఇచ్చిన హామీలు అమలు కావడం లేదని మాట్లాడుతున్న సమయంలో కార్యకర్తలు జై జగన్.. అంటూ నినాదాలు చేసి హోరెత్తించారు. కూటమి ప్రభుత్వంలో పథకాలు సక్రమంగా అమలు కావడం లేదని పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అధ్యక్షతన జరగగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జంకె వెంకటరెడ్డి, బత్తుల బ్రహ్మానందరెడ్డితో పాటు స్థానిక నాయకులు కూడా పాల్గొని మాట్లాడుతున్నంత సేపూ కార్యకర్తలు ఉత్సాహంగా మద్దతు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, కో ఆప్షన్ సభ్యురాలు గుంటక వనజాక్షి, షంషేర్ ఆలీబేగ్‌లు కార్యకర్తలతో జై జగన్ నినాదాలు ఇప్పించారు. పలువురు దివ్యాంగులు కూడా నియోజకవర్గంలోని వివిధ గ్రామాల నుంచి సమావేశానికి హాజరయ్యారు. సమావేశం చివరి వరకు కార్యకర్తలెవరూ బయటకు వెళ్లలేదు. సమావేశంలో డి.గోపాల్‌రెడ్డి, బాలిరెడ్డి, కౌన్సిలర్లు అమీరుల్లా ఖాన్, పీవీ నాయుడు, బొగ్గరపు శేషయ్య, రోజ్ లిడియా, ఆసీఫ్‌ఖాన్, జి.సత్యనారాయణరెడ్డి, నల్లబోతుల కొండయ్య, మహేశ్వరరెడ్డి, సంజీవరెడ్డి, ఖాదర్‌బాషా, గౌస్ మొహిద్దీన్, ఎస్.బాలచంద్రుడు, ఎల్.శేఖర్, కె.సురేష్, రఘుపతి శివ, బూదాల గురవయ్య, సోషల్ మీడియా రఫీ, గుంటక చెన్నారెడ్డి, ఆదిమూలపు లూకా, జంకె కృష్ణారెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.


మాట్లాడుతున్న ఇన్‌చార్జి అన్నా రాంబాబు


హాజరైన నాయకులు, కార్యకర్తలు

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పానుగంటి షాలెంరాజు


బాలుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంభం: అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన బాలుడి మృతి విషయంలో కేసు దర్యాప్తులో ఉండగానే సహజ మరణమంటూ పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన స్టేట్‌మెంట్ బాధాకరమని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పానుగంటి షాలెంరాజు అన్నారు. శనివారం లింగోజీపల్లి గ్రామానికి వెళ్లి బాలుడు లక్షిత్ కుటుంబ సభ్యులను ఎమ్మార్పీఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలుడి కుటుంబానికి న్యాయం జరగాల్సిన విషయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పోలీసులు వాస్తవాలు బయటకు తీసి ఆ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైతే ఉన్నతాధికారులతో విచారణ చేపట్టి నిందితులను శిక్షించాలన్నారు. తాము బాలుడి కుటుంబాన్ని పరామర్శించేందుకు వస్తున్న నేపథ్యంలో సమాచారం తెలుసుకున్న పోలీసులు పూర్తి స్థాయిలో తమ మీద నిఘా పెట్టారని, తాము సంఘద్రోహులం కాదన్నారు. ఒక కుటుంబం ఇబ్బందులు పడుతుంటే వాళ్లకు అండగా నిలబడేందుకే ఇక్కడికి వచ్చామే తప్పా ఎటువంటి అలజడి చేయడానికి రాలేదన్న విషయాన్ని పోలీసులు గుర్తించాలన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి నేదరపల్లి జయరాజ్, తదితరులు పాల్గొన్నారు.

18న చలో ఢిల్లీ

దర్శి: కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టనున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కేవీ పిచ్చయ్య తెలిపారు. శనివారం స్థానిక సుందరయ్య భవన్‌లో చలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరించారు. కేవీ పిచ్చయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు అనేక హామీలు ఇచ్చారని, నేటికీ అవి అమలుకు నోచుకోలేదన్నారు.

ఉప్పొంగిన భక్తి భావం


వెలుగొండలో దర్శనమిస్తున్న శ్రీవారు


రేగడపల్లిలో శ్రీవారిని దర్శించుకుంటున్న భక్తులు

- ఆలయాల్లో భక్తుల పూజలు

కొనకనమిట్ల: మండలంలోని ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. భక్తి పరవశంతో ఉప్పొంగిన భక్తులు నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు సింహాద్రిచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా..అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విజయకాంత్ శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అకలంకం వెంకటరామకృష్ణాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఎండలు బాబోయ్.. ఎండలు!


మునగపాడు సమీపంలో చెట్టు నీడన మూగజీవాలు


గొట్లగట్టులో చెట్టు నీడన సేదతీరుతున్న జనం

కొనకనమిట్ల: మామూలుగా రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఎండలు కాస్తాయి. కానీ ఈ ఏడాది రోహిణిలో అప్పుడప్పుడూ మోస్తరు వర్షాలు కురిశాయి. ప్రస్తుతం మృగశిర, ఆరుద్ర కార్తె పోయి పునర్వసు కార్తె వచ్చింది. మృగశిర, ఆరుద్రలో ముసలి ఎద్దులు రంకెలేస్తాయి అంటారు పెద్దలు. అంటే మంచి వర్షాలు కురిసి వాతావరణం చల్లబడి కాస్త ఉపశమనం కలుగుతంది. కానీ అందుకు భిన్నంగా మళ్లీ ఇటీవల కొన్ని రోజులుగా ఎండలు కాస్తూ ఉక్కబోతగా ఉంది. దీంతో మధ్యాహ్నం వేల జనం చెట్ల నీడన హాయిగా సేదతీరుతూ కాలక్షేపం చేస్తున్నారు. పశు మేత కోసం పొలాలకు వెళ్లే మూగజీవాలు చెరువులు, కుంటల్లో ఉన్న నీటిలో దిగి చల్లగా నీటిలో ఈదుతూ సేద తీరుతున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనులు ఊపందుకోనున్నాయి, అయితే వర్షం కోసం జనం ఎదురు చూస్తున్నారు. మేఘాలు అప్పుడప్పుడూ వర్షిస్తున్నాయి కానీ అనుకున్న మేర వర్షం పడటం లేదు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com